

నేను ఎందుకు రాస్తున్నానో అదే నా పరిచయం కావాలని కోరుకుంటున్నాను—

1977 ఆంధ్రజ్యోతి వీక్లీలో "జాడీ" బహుమతి కథతో సాహితీ లోకానికి పరిచయమయ్యాను. ఆ మధ్య చాసోగారు హైదరాబాద్ వచ్చినపుడు— "జాడీ కథ రాసింది నువ్వేనటోయ్....!" అంటూ ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నారు. "మనవాడివే—" అని వెన్ను తట్టారు. "పేరు చూసి ఎవరో అమ్మాయి అనుకున్నాను—" అన్నారు. అవి మరచిపోలేని క్షణాలు.

# గోడుపు కాకు!

## వీణా భోజన్ తయార్ హై, నహీఁ?

"తెస్తున్నా కదా...."

"అచ్ఛా అచ్ఛా లావో.... నహీతో ఉదర్ బస్ నహీ మిలీ...."

"ఏవిటి తెలుగు నీకంత చేదయిందా హిందీలో మాట్లాడ్తున్నావ్?!...."

"హా! హా! తుమ్‌కీ హిందీమే బాత్ కర్‌నా ఆజ్‌సే సీఖ్‌లో...."

చాల్లే ముద్దుగా తెలుగులో మాట్లాడ్తావా లేక నా మౌన ముద్రను చూస్తావా?

"అదికాదు వీణా.... మనం తెలుగులో మాట్లాడకూడదు. తెలుగు దుసులేసుకో కూడదు. అది నేరం. దేశ ద్రోహం....

"ఎవరా మాట అన్నది? పాత చీపురు తిరగేసేను జాగ్రత్త...."

"మనం మన ప్రాంతాన్ని మరచి పోవాలి ప్రాంతీయ భాషను మరచి పోవాలి ప్రాంతీయ వీరులను, కవులను, గాయకులను, నాయకులను మరచిపోవాలి. మన ఆట స్థలాలకు ఇందిరా స్టేడియం, లాల్ బహదూర్ స్టేడియం అని, మన ఆడిటోరియాలకు టాగోర్ ఆడిటోరియం, రవీంద్ర భారతి. మన పార్కులకు ఇందిరా పార్కు నెహ్రూ పార్కు అని ఇలా పేర్లు పెట్టుకోవాలి.

"ఉహూ.... వాళ్ళు మాత్రం ఒక ప్రాంతం వాళ్ళు కాదా?"

"కాదు. వాళ్ళంతా భారతదేశం వాళ్ళు:"

"ఓహో భారతదేశం అనేది ఎక్కడుందో చెప్పు?"

"ఎక్కడంటే ఎక్కడంటే...."

"ఉత్తరాన హిమాలయాల నుంచి దక్షిణాన కన్యాకుమారి తూర్పున బంగాళాఖాతం నుంచి పశ్చిమాన అరేబియా సముద్రం వరకు గల భూభాగమే భారత దేశం కదా?"

"అవునవును...."

"అయితే ఆ భూభాగంలోని ప్రతి ప్రాంతము భారతదేశంమే కదా? అంతేనా! భారతదేశమనేది ప్రాంతాల్లో కాక ఆకాశంలో ఉందా?....

"కాదు కాదు. అన్ని ప్రాంతాలు కలిస్తేనే భారతదేశం...."

"మరి అన్ని ప్రాంతాలను అభిమానిస్తే భారతదేశాన్ని అభిమానించినట్టు కాదా? అలాంటప్పుడు ఈ ప్రాంతాన్ని అభిమానించడం దేశ ద్రోహం ఎలా అవుతుంది చెప్పు. ఈ ప్రాంతంలోని భాషలో మాట్లాడటం భారతదేశ భాషలో మాట్లాడినట్లే కదా.... ద్రోహం ఎలా అవుతుంది?...."



"ఏమో నాకు తెలియదు...."

"మన తెలుగు కూడా భారతదేశపు భాషేకదా మనరచయితలు కవులుకూడా భారతీయ రచయితలు, కవులే కదా.... కనీసం ఒక్క ఆడిటోరియం పేరైనా గురజాడ ఆడిటోరియమనో, శ్రీశ్రీ ఆడిటోరియమనో ఉంచ కూడదా?"

" కూడదట వీణా.... అది ద్రోహమట నేరమట.... సంకుచితత్వం ప్రాంతీయ

తత్వం అట.... ఇంకా చాలా చాలానట వేర్పాటు ధోరణి అట...."

పిచ్చి వాగుడు వాగకు. నాకు ఒళ్ళు మండిందంటే ఎర్రని కారం ఒంటికి రాసి ఎండలో నిల్చోబెడ్తాను చూడు. ఏది వేర్పాటు ధోరణి? దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే ప్రజలోయ్ అంటూ జాతిని ప్రబోధించిన గురజాడ పేరుతో ఒక



కళాక్షేత్రం ఉండాలనడం ప్రాంతీయ తత్వమా?!! గురజాడ ప్రాంతీయ కవి అయిపోయాడా? ఏం రవీంద్రనాథ్ ఠాగోర్ మాత్రం బెంగాలీలో కవిత్వం రాయలేదా? అతను మాత్రం ప్రాంతీయ కవి కాదా? అతడు దేశకవి- గురజాడ, శ్రీశ్రీలు తెలుగులో కవిత్వం రాస్తే ప్రాంతీయ కవులా?

గంగానది అంటే దేశాభిమానం.... గోదావరి అంటే ప్రాంతీయమా? గంగా నది మాత్రం ఒక ప్రాంతంలోనే లేదా? ఉత్తరాన హిమాలయాల్నించి దక్షిణాన కన్యాకుమారి వరకు ప్రవహిస్తోందా? ఉత్తర భారత కవుల్ని, నాయకుల్ని భుజాల మీదికి ఎక్కించుకోవడం దేశాభిమానం. తెలుగు కవుల్ని, నాయకుల్ని అభిమానించడం ప్రాంతీయతత్వం అవుతుందా? వేర్పాటు ధోరణి అవుతుందా? పిచ్చాసుపత్రికి దగ్గరవుతున్న నిన్ను చూస్తుంటే జాలేస్తున్నాదోయ్ రాంబాబూ...."

"ఉహూ.... నాకేం తెలియదు. ఫలానా నాయకుల ప్రచారం విని విని .... చదివి చదివి.... చూసి చూసి .... నా మెదడిలా తయారయింది.... తెలుగులో మాట్లాడితే దేశ ద్రోహమనే స్థితికి వచ్చి... ఆఫీసులో బజార్లో హిందీలోనే మాట్లాడ్తున్నా.... ఇంట్లో తెలుగులో మాట్లాడితే ఎవరన్నా విని దేశద్రోహం చేస్తున్నానని మా ఆఫీసర్‌తో చెబుతారేమోనన్న భయంతో.... ఇవ్వాల్టి నుంచి ఇంట్లో కూడా హిందీలోనే మాట్లాడాలని నిశ్చయించుకున్నా వీణా.... మా ఆఫీసర్ సంగతి నీకు తెలియదు. గొప్ప దేశాభిమాని ఎప్పుడూ హిందీలోనే మాట్లాడ్తాడు. హిందీ సిని

మాలే చూస్తాడు....

"ఇప్పుడైనా తెలిసిందా మరి .... అది కూడా ఒక ప్రాంతీయ భాషేనని.... అన్ని ప్రాంతాలను అభిమానించడమే దేశాన్ని అభిమానించడం అవుతుందని.... ఎవరేవి రాసినా తన మోహంమీద.... కిమ్మనకుండా ఊరుకుంటుండేగోడ.... అలాంటి గోడవు కాకు. ఎవరేది చెప్తే అది ఒప్పేసుకోకు.... నీకు మెదడు, జ్ఞానం ఉంది.... ఆలోచించు .... ఉత్తరాన హిమాలయాల్నించి దక్షిణాన కన్యాకుమారి వరకు ప్రతి అంగుళం నేల భారతదేశమే.... తెలుగును అభిమానిస్తే.... తెలుగు ప్రాంతాన్ని అభిమానిస్తే భారత దేశాన్ని అభిమానించినట్లే అది దేశద్రోహం కాదు. ఉత్తరప్రదేశ్ వాలా గోబ్యాక్, మధ్య ప్రదేశ్ వాలా గోబ్యాక్.... మద్రాసీ వాలా గోబ్యాక్, కేరళ వాలా గోబ్యాక్.... ఆంధ్రా గో బ్యాక్.... తెలంగాణా గో బ్యాక్ .... రాయలసీమా గో బ్యాక్ అంటే అది సంకుచితత్వం.... దేశ ద్రోహంగాని.... తెలుగు ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పం దేశద్రోహం కాదు. ఏవీధి వాళ్ళు ఆ వీధిని శుభ్రంగా ఉంచుకుంటేనేనగరం శుభ్రంగా ఉంటుంది. అంతేకాని నగరమనేది శుభ్రంగా ప్రత్యేకంగా ఆకాశం నుంచి ఊడి పడదు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధిచెందుతుంది. ఊక దంపుడు ఉపన్యాసాలు మాని తెలుగు నేల అభివృద్ధికి పాటుపడమని ఫలానా నాయకులకు చెప్పడం మంచిది. అదే జాతీయ సేవ.... దేశ సేవ.... వింటున్నావా రాంబాబూ...."

"వింటున్నా వీణా.... నువ్వు చెప్పిందే నిజం.... ఫలానా నాయకుల పిచ్చిమాటలు నమ్మి దేశద్రోహం చేయబోయాను.... ఇక అస్సలు వాళ్ళమాటలు నమ్మను" ●

### వాళ్ళు-వీళ్ళు

వీళ్ళేమో
ఉత్తుత్తి మాటలకే భ్రమసి
ఊళ్ళేం నిస్తున్నారు వాళ్ళని!
వాళ్ళేమో
కొత్త కొత్త చట్టాలు తెచ్చి
పెంచేస్తున్నారు జైళ్ళని!

—సౌభాగ్య

# మినీకథ

## చందమామ ఎరుపెక్కింది

వేసవి. ఎండ వేడిమిని. ఉక్కను భరించలేక ఏదైనా ఏ.సి. థియేటర్‌లో మేట్నీ షో చూద్దామని బయల్దేరాను—

"ప్యార్ ఝుక్‌తా నహీ"— హిందీ సినిమా.

పెద్ద రద్దీగావేమీలేదు. తేలిగ్గా టికెట్ తీసుకొని థియేటర్‌లోకి నడిచాను.

ఏ.సి. చల్లదనం ఎంతో ఆహ్లాదాన్ని కల్గిస్తోంది.

హాలు క్రమేణా ప్రేక్షకులతో నిండిపోతోంది. ఇంతలోకాలేజ్ స్టూడెంట్స్ కాబోలు యిద్దరమ్మాయిలు వచ్చి నా ముందు వరసలో కూర్చున్నారు. వారి వెనగ్గానే మరో ఇద్దరు కుర్రాళ్లు వచ్చి నా ప్రక్క సీట్స్‌లో బైఠాయించారు—

ఇంకా సినిమా ప్రారంభం కావడానికి ఓ ఐదు నిమిషాలైనా టైము వుంటుంది.

అందాక ఓ సిగరెట్ ముట్టిద్దామన్న ఆలోచనకల్గి సీట్లోంచి లేవబోతుండగా—

"అబ్బ! తెల్లని చందమామ గురో" అన్నాడు నా ప్రక్క కూర్చున్న కుర్రాడు.

ఎవరినుద్దేశించి అన్నదీ నాకు తెలుస్తూనే వుంది.

ముందు సీట్లో కూర్చున్న అమ్మాయి గిరుక్కున వెనుదిరిగి కిసుక్కున నవ్వింది.

పొంగిపోయారు నా ప్రక్క సీట్లోని కుర్రాళ్ళు.

లవ్‌బర్డ్స్ అనుకున్నాన్నేను.

"మీరు కొంచెం ప్రక్కకు వస్తారూ" అంది అమ్మాయి నాతో చిలిపిగా ఏమనను? పానకంలో పుడకలా వాళ్ళ మధ్య నేనెందుకు? అనుకొన్నా—

నేను తొలిగాను........ ఆ అమ్మాయి నా సీటు దగ్గర కొచ్చింది. అంతే! కుర్రాడి చెంప పేలిపోయింది—

"ఎలా వుందిరా రాస్కెల్ చందమామా?.... తెల్లగావుందా? ఎర్రగావుందా?" ఆవేశంగాఅంది.

అప్పుడే లైట్స్ ఆఫ్ అయ్యాయి.

పిక్చర్ స్టార్ట్ అయింది.

—శ్రీమతి డి. శాంతకుమారి

### కళ్ళడాక్టర్



"అయ్యా! కళ్ళులేని వాడను. ధర్మం చెయ్యండయ్యా" అంటూ వచ్చాడు భిక్షగాడు.

"ఆహా! ఎన్నాళ్టికి నాకీ భాగ్యం కలిగినది. రాబాబు కళ్ళు పరీక్ష చేస్తాను." అన్నాడు డా॥ చిదానందం.

—యం. మనోరంజన్‌బాబు (గుంటూరు)